క్లుప్తంగా

27న ఉప సర్పంచ్ పదవులకు ఎన్నిక

మునగపాక: మండలంలోని ఖాళీగా ఉన్న ఉప సర్పంచ్ పదవులకు ఈ నెల 27న ఎన్నికలు నిర్వహిస్తామని ఎంపీడీవో ఎం.ఉషారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాల వల్ల ఉప సర్పంచ్ పదవులకు ఎన్నిక నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మునగపాక, నాగులాపల్లి, తోటాడ, రాజుపేట, నారాయుడుపాలెం తదితర పంచాయతీలకు సంబంధించి ఎన్నిక జరగనుందన్నారు. ఉప సర్పంచ్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని ఆమె కోరారు.

బి.కె.పల్లి ఉపసర్పంచ్ ఎన్నికకు నోటిఫికేషన్

కోటవురట్ల: బి.కె.పల్లి ఉప సర్పంచ్ పదవి ఎన్నిక కోసం నోటిఫికేషన్ ఇచ్చినట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా సర్పంచ్‌కు, వార్డు సభ్యులు నోటీసు పంపించామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు వింటున్న అధికారులు

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అర్జీదారుల సమస్యలు విన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ శనివారం రెవెన్యూ కార్యాలయంలో అధికారుల సమక్షంలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇరువర్గాల వారు తప్పనిసరిగా హాజరు కావడం ద్వారా సమస్య పరిష్కారం అవుతుందన్నారు. చిన్న పాటి వివాదాలను స్థానికంగా పరిష్కరించుకోవాలన్నారు. తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, ఎస్ఐ పి.ప్రసాదరావు, రీ–సర్వే డీటీ పడాల్, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అవగాహన



కైలాసపట్నంలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ ప్రసాద్

కోటవురట్ల: జగనన్న కాలనీ స్కీమ్‌లో అసంపూర్తిగా నిలిచిన ఇళ్ల నిర్మాణాన్ని మళ్లీ కొనసాగించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని హౌసింగ్ ఏఈ వరప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన కైలాసపట్నంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కైలాసపట్నంలో గత ప్రభుత్వంలో స్థలాలు పొంది ఇళ్ల నిర్మాణాన్ని 35 మంది లబ్ధిదారులు మధ్యలో ఆపేశారని తెలిపారు. వారిని గుర్తించి ఇళ్ల నిర్మాణం తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు అదనంగా ఇస్తున్నట్టు తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం నేడు



కరపత్రం విడుదల చేస్తున్న స్థానిక నాయకులు

ఎస్.రాయవరం: అచ్యుత్ హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యంలో ధర్మవరం అగ్రహారంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సీ అచ్యుత్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి కరపత్రం విడుదల చేశారు. గ్రామంలో పలుమార్లు నేత్ర వైద్య శిబిరం నిర్వహించి పలువురికి కంటి సమస్యలు, ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించామన్నారు. విశాఖపట్నానికి చెందిన పలు కంటి ఆస్పత్రుల వైద్యులతో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపవేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండకర్ల కూడలి, యర్రవరం, ఉప్పవరం, మళ్లవరం, ఎంజేపురం, నరేంద్రపురం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఎస్.రాయవరం : కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో ఎస్.రాయవరం ఫీడర్‌లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎస్.రాయవరం ఫీడర్‌లో చెట్టు కొమ్మలు తొలగింపు, మరమ్మతులు వల్ల ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండబోదన్నారు. ఈ మేరకు వినియోగదారులు సహరించాలన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై మక్కువ



మాట్లాడుతున్న డీపీఎం లచ్చన్న



సమావేశానికి హాజరైన అధికారులు

మునగపాక: సేంద్రియ వ్యవసాయంపై మరింత మక్కువ పెంచేలా చూడాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం లచ్చన్న కోరారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగానికి స్వస్తి పలికి సేంద్రియ పద్ధతిలో పంటల సాగు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఖరీఫ్– 2025లో భాగంగా ఒక గ్రామాన్ని ఆదర్శంగా ఎంచుకుని, అక్కడ సేంద్రియ వ్యవసాయం సాగు జరిగేలా చూడాలన్నారు. వెలుగు సిబ్బంది సహకారం తీసుకొని ప్రతిష్ఠాత్మకంగా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న కుమారి, ఒంపోలు సర్పంచ్ సూరిబాబు, వీవోఏలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతి నీటిబొట్టును కాపాడుకోవాలి



గొయ్యిని పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

మునగపాక: ప్రతి నీటిబొట్టును కాపాడుకోవాలని సర్పంచ్ దొడ్డి మంగవేణి, కోటేశ్వరరావు కోరారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మండలంలోని తోటాడలో రైతు సత్యనారాయణ భూమిలో శనివారం ఉపాధి హామీ పథకం కింద నీటికుంట(పంట సంజీవిని గొయ్యి)తవ్వడం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. నీటిని వృథా చేయకుండా అవసరం మేరకు వినియోగించుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, కూటమి నేతలు పి.మురళీకృష్ణ, బి.గణేష్, అప్పారావు, ఉపాధి హామీ పథకం అధికారులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ఫ్లెక్సీల ఏర్పాటు

ఎస్.రాయవరం: మత్తుపానీయాలు సేవించి వాహనాలు నడపవద్దని ఎస్ఐ విభీషణరావు సూచించారు. జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు శనివారం అడ్డురోడ్డు జాతీయ రహదారిలో, ఎస్.రాయవరం కూడలిలో ప్రమాదాల నివారణకు అవగాహన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాహనాల్లో అధిక లోడు, అతివేగంగా బైకులు నడపడం, చిన్నపిల్లలు డ్రైవింగ్ చేయడం వంటి సంఘటనలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీటిపై జాగ్రత్తలు తీసుకుని పోలీస్ అధికారులకు సహకరించాలన్నారు.

కార్పొరేషన్ రుణాల గడువు పొడిగించాలి



జెడ్పీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్

అచ్యుతాపురం రూరల్: వెనుకబడిన తరగతుల వారు స్వయం ఉపాధి పొందడానికి ప్రభుత్వం విడుదల చేసిన కార్పొరేషన్ రుణాల గడువు పొడిగించాలని జెడ్పీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ అధికారులు స్వయం ఉపాధి కార్పొరేషన్ రుణాలపై అవగాహన కల్పించకపోవడం వల్ల ప్రజలు సద్వినియోగం చేసుకోలేకపోయారన్నారు. స్వయం ఉపాధి కోసం 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంక్ లోన్‌తో రూ.5,444 వేల కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ నెల 22వ తేదీతో కార్పొరేషన్ రుణాల ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ముగిసిందన్నారు. దాంతో చాలా మంది యువకులు దరఖాస్తులు చేసుకోలేదన్నారు. దరఖాస్తుల గడువు పొడిగించి వారికి సబ్సిడీ రుణాలు మంజూరు చేసి, ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

25న వీరాంజనేయ స్వామి తీర్థం

మాడుగుల రూరల్ : మండలంలో ఎం.కోటపాడు, వల్లాపురం గ్రామ ఆరాధ్య దైవం అయిన వీరాంజనేయ స్వామి తీర్థం ఈ నెల 25వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనల తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు ప్రథమ బహుమతి రూ. 15వేలు, ద్వితీయ రూ.12వేలు, తృతీయ రూ.10వేలు చొప్పున...అలాగే మరిన్ని స్థానాల్లోనూ రూ.8 వేల నుంచి రూ.1000 వరకూ నగదు బహుమతులు అందిస్తామన్నారు.

క్రికెట్ టోర్నీ 2025 పోటీలు..

క్రికెట్ క్రీడాకారులు, యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ2025 పేరిట క్రికెట్ పోటీలు అదే రోజు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమ బహమతి రూ.50వేలు, ద్వితీయ బహమతి రూ.25వేలు, తృతీయ బహమతి రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు అందివ్వనున్నట్టు తెలిపారు. దాతల సహకారంతో విజేతలకు బహమతులు అందజేస్తారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, అన్న సమారాధన నిర్వహించనున్నారు.

పునరావాస కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి



నిర్వాసితులతో చర్చిస్తున్న సీపీఎం బృందం

అచ్యుతాపురం రూరల్: పునరావాస కాలనీల్లో ప్రజల సమస్యలు పరిష్కరించి కనీస మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శనివారం సెజ్ కాలనీ, రావిపాలెం గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సెజ్, బార్క్, ఎన్టీపీసీలు నెలకొల్పేందుకు భూములు త్యాగం చేసిన రైతుల కుటుంబాలు నేడు కనీస మౌలిక వసతులకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, వారి తలరాతలు మారడంలేదని వాపోయారు. రావిపాలెంలో పునరావాసం కల్పించకుండా, భూములకు నష్టపరిహారం ఇవ్వకుండా బార్క్ బలవంతంగా ప్రహరీ నిర్మాణం చేస్తున్నారన్నారు. దిబ్బపాలెంలో ప్రజలకు తాగునీరు లేక అనేక మంది ఇప్పటికే కిడ్నీ వ్యాధులతో మృత్యువాత పడినా అధికారులు, నాయకులు నేటికీ సమస్య పరిష్కరించడం లేదన్నారు. భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు చెందిన యువతకు పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పరిశ్రమల కాలుష్యం కారణంగా గ్రామాల ప్రజలు కొత్త జబ్బులకు గురవుతున్నారని, నివారణకు అధికారులు తగు చర్యలు చేపట్టి వారి ప్రాణాలు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శంకర్రావు, కూండ్రపు సోమునాయుడు, శ్రీను, సూర్యకల, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

26న మెగా జాబ్ మేళా

నర్సీపట్నం : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ వారి సౌజన్యంతో నర్సీపట్నం రిషీ కాలేజీలో ఈ నెల 26న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల కరస్పాండెంట్ కె.సతీష్ తెలిపారు. ఈ జాబ్ మేళాలో 18 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. హెటీరా, డక్కన్, అపోలో, ఫోక్స్‌కాన్, అరబిందో తదితర కంపెనీల ప్రతినిధులు హాజరువుతున్నారని తెలిపారు.

మండల సమావేశంలో భూసమస్యలపై ధ్వజం



భూసమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్న సర్పంచ్ కన్నయ్యనాయుడు

నర్సీపట్నం : మండల పరిషత్ సమావేశంలో భూసమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తాము ముగ్గురు అన్నదమ్ములం..మాకు ఉన్న భూమిని ముగ్గురికీ కాకుండా రీ సర్వేలో రెవెన్యూ సిబ్బంది ఆరుగురికి పంపిణీ చేశారని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, ధర్మసాగరం సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు డీటీని ప్రశ్నించారు. తమకు సంబంధం లేని ముగ్గురు వ్యక్తులకు మా భూమిని ఎలా పంచుతారని నిలదీశారు. అధికార పార్టీకి చెందిన జెడ్పీటీసీ సుకల రమణమ్మ రెవెన్యూ సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. తనకు సంబంధించిన 82 సెంట్ల జిరాయితీ భూమి రీసర్వే చేసిన తర్వాత 69 సెంట్లు చూపిస్తుందని, మిగిలిన భూమి ఏమైందని డీటీ నరేంద్రను వివరణ కోరారు. జిరాయితీ భూములను ఈనాం భూములుగా చూపించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ విషయాలను తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లి పొరపాట్లు జరగకుండా చూస్తానని డీటీ నరేంద్ర బదులిచ్చారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే జీలుగ, జనుము విత్తనాలు రప్పించాలని ఎంపీటీసీ రాంప్రసాద్ ఏవో అప్పారావుకు సూచించారు. సమావేశంలో వైస్‌ఎంపీపీలు తాతబాబు, ఇన్నం రత్నం, ఎంపీడీవో ఉషాశ్రీ, సూపరింటెంటెంట్ రమణబాబు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు భరత్‌కుమార్ అండ

తుమ్మపాల: పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఎల్లప్పుడూ అండగా ఉంటున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జాజుల రమేష్ తెలిపారు. పట్టణంలో 83వ వార్డు వైఎస్సార్‌సీపీ గృహ సారథి తురకలపూడి సరోని తల్లి సత్యవతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబానికి రూ.5 వేల సాయం చేశారు. భరత్ సూచనల మేరకు శనివారం తురకలపూడి సరోని తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యకర్తలు బండి ఆనంద్, కటారి నూకరాజు, నడుపూరి శ్రీనివాసరావు, రెడ్డి చంటి పాల్గొన్నారు.


31 వరకూ గాలికుంటు టీకాల కార్యక్రమం



ఆవులకు గాలికుంటు టీకాలను వేస్తున్న పశువైద్యాధికారి నాయుడు

కె.కోటపాడు : గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు 3 నెలలు దాటిన ఆవులు, గేదెలకు పాడి రైతులు తప్పక టీకాలు వేయించాలని కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు అన్నారు. కొరువాడ, డి.అగ్రహారం, గవరపాలెం గ్రామాల్లో పశువైద్య సహాయకులు శనివారం నిర్వహిస్తున్న గాలికుంటు టీకాలను వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొరువాడ పశువైద్య కేంద్రం పరిధిలో గల గ్రామాల్లో 5500 ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయాలని లక్ష్యం పెట్టుకోగా ప్రస్తుతానికి 4200 పశువులకు వేసినట్టు తెలిపారు. ఈ నెలాఖరువరకూ టీకాల కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. టీకాలను ఆరు నెలలు దాడిన చూడి పశువులకు వేయరాదని ఆయన సిబ్బందికి తెలిపారు. పశువైద్య సహాయకులు లింగేశ్వరరావు, దేముడు పాల్గొన్నారు.

'వీఆర్పీపై తప్పుడు ఫిర్యాదులు తగవు'



వీఆర్పీపై తప్పుడు ఫిర్యాదుపై డ్వామా పీడీ దృష్టికి తీసుకెళ్లిన వైస్ ఎంపీపీ సునీల్

నాతవరం : తప్పుడు ఫిర్యాదుతో ఫీల్డ్ అసిస్టెంటు (వీఆర్పీని) ఇబ్బంది పెట్టే విధంగా కూటమి నేతలు ప్రయత్నించడం సరి కాదని, వాస్తవాలు పరిశీలించాలని డ్వామా పీడీ పూర్ణిమాదేవి దృష్టికి వైస్ ఎంపీపీ పైల సునీల్ సర్పంచ్ బోడ్డు సత్యనారాయణ తీసుకెళ్లారు. గన్నవరం పంచాయతీలో సామాజిక తనిఖీలు చేసే బృందం వచ్చినప్పుడు కొందరు తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. ఆరుగురు పేర్లు తప్పుడు మస్తర్లు వేసినట్టుగా కావాలని వీఆర్పీపై ఫిర్యాదు చేశారన్నారు. క్షేత్రస్థాయిలో సక్రమంగా పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. ముందు ఆరుగురికి తప్పుడు మస్తర్లుగా వేశారని ఫిర్యాదు చేసి, సభలో ఇద్దరే అంటూ చూపించారని అన్నారు. ఇద్దరిలో ఒకరు సభ వద్దకు వచ్చి తాను ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్లానని చెప్పారని, దీని బట్టి తప్పుడు ఫిర్యాదులని స్పష్టమవుతుందని వాస్తవాలు పరిశీలించాలని అన్నారు. దీంతో సభలో కూటమి నేతలు, వైస్ ఎంపీపీ, సర్పంచ్‌ల నడుమ వాదులాట జరిగింది. పీడీ కలుగజేసుకుని వాస్తవాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కర్రల లోడుతో వెళుతున్న లారీ

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాక మెయిన్‌రోడ్డులో శనివారం పెద్ద ప్రమాదం తప్పింది. ద్విచక్ర వాహనదారుని బైక్ వెనుకభాగంలో లోడుతో వెళుతున్న లారీ నుంచి కర్ర జారిపడింది. కాస్త ముందుగా కర్ర పడిఉంటే ప్రమాదం జరిగి ఉండేది. వివరాలు ఇలా ఉన్నాయి. మునగపాకకు చెందిన మొల్లేటి సత్యనారాయణ శనివారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై మెయిన్‌రోడ్డుకు వస్తున్నారు. అదే సమయంలో అనకాపల్లి నుంచి అచ్యుతాపురానికి కర్రల లోడుతో లారీ వెళుతుంది. పీఏసీఎస్ కార్యాలయం ఎదురుగా వచ్చే సరికి లోడు నుంచి కర్ర జారి పడి బైక్‌పై పడింది. బైక్ వెనుక భాగం దెబ్బతింది. సెకెండ్ వ్యవధిలో కర్ర ముందు పడి ఉంటే సత్యనారాయణకు దెబ్బతగిలి ఉండేది. తృటిలో ప్రమాదం తప్పినట్టయింది. దీంతో స్థానికులు లారీ డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. ఒకవైపు అధికలోడుతో వెళుతున్న భారీ వాహనాల రాకపోకల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నా ఇవేమీ పట్టనట్లు కొంతమంది లారీ డ్రైవర్లు ఇష్టానురాజ్యంగా వాహనాలను తిప్పడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి అధికలోడుతో వచ్చే వాహనాలకు కళ్లెం వేయాలని పలువురు కోరుతున్నారు.

పంట నిల్వకు యాజమాన్య పద్ధతులు పాటించాలి

పెందుర్తి: పండించిన పంట నిల్వకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని కేంద్ర గిడ్డంగుల సంస్థ జిల్లా యూనిట్–1 మేనేజర్ పి.శ్యాం సుందర్‌బాబు సూచించారు. స్థానిక మహిళా ప్రగతి కేంద్రంలో 'కృషి సంవర్ధన్' కార్యక్రమంలో భాగంగా శాస్త్రీయ పద్ధతిలో ధాన్యం నిల్వ చేసుకునే విధానాన్ని రైతులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతులతో సేద్యం చేస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. వ్యవసాయంలో సాంకేతికతను వినియోగించుకుంటే రైతులకు వ్యయభారం తగ్గుతుందన్నారు. పంట నిల్వకు ప్రభుత్వ గిడ్డంగులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు గిడ్డంగుల సంస్థ నుంచి అందుతున్న రుణ సదుపాయాల గురించి వివరించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఒక్కో రైతుకు 1.5 క్వింటా మెటల్ బిన్‌లు, కిలో రాగి విత్తనాలు ఉచితంగా అందించారు. ఏవో టి.దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ ప్రతినిధులు ద్రవిన్ గొట్టపు, మజ్జి సూర్యకుమారి పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతిపై చర్చించాలి

● డీవైఈవో అప్పారావు



బోదిగల్లం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈవో

నక్కపల్లి: త్వరలో జరగనున్న అన్ని తరగతులు పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి. అప్పారావు కోరారు. శనివారం ఆయన నక్కపల్లి, పెద బోదిగల్లం పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా సైన్స్ సబ్జెక్ట్‌పై ఎనిమిదో తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఏయే తరగతుల్లో ఎంత మంది వెనుకబడిన విద్యార్థులున్నారో వివరాలు తెలుసుకున్నారు. వారికోసం తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులు ప్రగతిపై వారి తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. కేవలం పదో తరగతి పైనే కాకుండా అన్ని తరగతుల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వారు సాధిస్తున్న ప్రగతిని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం తీసుకుంటున్న చర్యలపై తెలియజేయాలన్నారు. ఎంఈవో నరేష్, హెచ్ఎం సత్యనారాయణ ఉపాధ్యాయులు ఆచార్యులు తదితరులు ఉన్నారు.

సొసైటీ అభివృద్ధికి అందరి సహకారం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు

కోటవురట్ల: సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి రైతులు దోహదపడాలని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు కోరారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాజన సభను శనివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ సొసైటీని రైతులంతా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సొసైటీలో రైతులకు రుణ పరిమితిని పెంచి సకాలంలో వసూళ్లు చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. బంగారు ఆభరణాలను తాకట్టు తీసుకుని రుణాలు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆర్ఎస్ సీతారామరాజు, ఎంపీటీసీ పుత్రేవు వెంకట సూర్యారావు, టీడీపీ జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, సొసైటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల వర్తింపునకు పీ–4 సర్వే



దోసలపాడు గ్రామసభలో పాల్గొన్న ఎంపీడీవో

నక్కపల్లి: ప్రభుత్వం నిర్వహిస్తున్న పీ– 4, క్యూర్ కోడ్ సర్వేలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. శనివారం చీడిక, దోసలపాడు గ్రామాల్లో పీ–4 సర్వేపై నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను వర్తింపజేసేందుకు, ప్రజల ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ సర్వే నిర్వహిస్తోందన్నారు. ఇంటింటికి వచ్చి కార్యదర్శులు కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తున్నారన్నారు. అధికారులకు తమ వివరాలను అందజేసి సహకరించాలన్నారు. సర్వేకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్తులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి



ఉపమాక వెంకన్నను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తుల తాకిడి నెలకొంది. వారాంతపు సెలవు దినాలు కావడంతో పాటు కల్యాణోత్సవాల సందర్భంగా ఉపమాకలో 20 రోజుల నుంచి తిరునాళ్లు జరుగుతున్నాయి. శనివారం వేకువజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. క్యూలైన్లో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. బేడా మండపం చుట్టూ పెద్ద క్యూలైను ఏర్పాటైంది. స్వామి దర్శనం అనంతరం ఉపమాకలో జరిగిన తిరునాళ్లలో సుగంధ ద్రవ్యాలు, మసాలా దినుసులను కొనుగోలు చేశారు. దూరప్రాంతాల నుంచి కార్లు, మోటారు సైకిళ్లు, ఆటోలపై భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో వాహనాలతో కిక్కిరిసింది. దీనికి తోడు తిరునాళ్ల సందర్భంగా ఉపమాక ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన దుకాణాల వల్ల ఉపమాక మెయిన్ రోడ్డుపై తీవ్ర ట్రాఫిక్ జాం ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భజన బృందాలు ఆలయం వద్ద కోలాటం నిర్వహించాయి.

భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ ఆదర్శనీయం



పట్టణంలో ఎస్ఎఫ్ఐ ర్యాలీ

తుమ్మపాల: ప్రతి యువకుడు భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లను ఆదర్శంగా తీసుకుని సమాజం కోసం పాడుపడాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఎం.నూకరాజు కోరారు. పట్టణంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువకులు చెడు వ్యసనాలకు లోనై, సామాజిక మాధ్యమాలకు బానిసలవుతున్నారని వాపోయారు. వీటికి దూరంగా ఉండాలని, భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమాజంలో విద్యార్థినులు, మహిళలపై అనేక దాడులు జరుగుతున్నాయని, ప్రభుత్వం నేటికీ కఠిన చర్యలు తీసుకోలేని విధంగా ఉన్నాయన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రభుత్వాలు విఫలమవ్వడంతోనే యువత బానిసలై మత్తులో అనేక దారుణాలకు పాల్పడుతున్నాయన్నారు. సమాజంలో మార్పులు రావాలంటే విద్యార్థులకు, యువకులకు చరిత్ర తెలియజేయాలన్నారు. విద్యార్థి యువకుల్లో దేశభక్తిని పెంచాలన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, తిమ్మాపురం

రేఖ నెంబర్ 06/2025, తేది 20-03-2025

బహిరంగ వేలం ప్రకటన

అనకాపల్లి జిల్లా, ఎస్.రాయవరం మండలం, తిమ్మాపురం గ్రామ పంచాయతీలో 2025-2026 ఆర్థిక సంవత్సరమునకు ఈ దిగువ షెడ్యూల్ దాఖల వరుస నెంబరు నందు గల రోజువారి మార్కెట్ నందు ఆశీలు వసూలు చేసుకొను హక్కునకు మరియు కొబ్బరి చెట్ల ఫలసాయం పొందే హక్కు బహిరంగ వేలంపాట **తేదీ 25-03-2025 మంగళవారం ఉదయం 10 గంటల నుండి** వేలం పాట జరుపబడును. సదరు బహిరంగ వేలం పాటలు ఈ దిగువ సంతకందారునిచే గాని వారి అనుమతి పొందిన వారి చేతగాని వేలంపాటలు నిర్వహించబడును.

వ. స.	వివరములు	చెల్లించవలసిన ధరావత్తు
1.	తిమ్మాపురం గ్రామ పంచాయతీ రోజువారి మార్కెట్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆశీలు వసూలు చేసుకునే హక్కులకు గాను వేలంపాటలో పాల్గొన్నవారు చెల్లించవలసిన ధరావత్తు రూ. 25,000/- చెల్లించవలెను.	రూ. 25,000/-
2.	తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కొబ్బరి చెట్లు ఫలసాయం పొందే హక్కుకు గాను 2025-26 ఆర్థిక సంవత్సరానికి బహిరంగ వేలం పాటలో పాల్గొన్న వారు చెల్లించవలసిన ధరావత్తు రూ. 5,000/- చెల్లించవలెను.	రూ. 5,000/-

షరతులు :

1. బహిరంగ వేలంపాటలో పాల్గొను వారు గ్రామ పంచాయతీకి ఎటువంటి బకాయి ఉన్న యెడల వేలంపాటలో పాల్గొనుటకు అనర్హులు.
2. గ్రామ పంచాయతీ నిర్ణయించిన బైలా ప్రకారం మాత్రమే పాటదారులు ఆశీలు వసూలు చేయవలెను.
3. పై పాటలు ఏ సమయంలోనైనా రద్దుచేయడం గాని వాయిదా వేయడం గాని ఈ దిగువ సంతకందారుడికి పూర్తి అధికారం కలదు.
4. పై బహిరంగ వేలంపాట వివరాలు కార్యాలయం పనివేళలలో పని దినములలో తెలుసుకొనవచ్చును.

పంచాయతీ కార్యదర్శి,
గ్రామ పంచాయతీ తిమ్మాపురం, ఎస్.రాయవరం మండలం